
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 4 ఆగస్టు 2024





పైడిభీమవరం వద్ద హైవేపై వెలగని విద్యుత్‌ దీపాలు

అమ్మో.. హైవే!



● జూలై 24న లావేరు మండలం సుభద్రాపురం జంక్షన్‌ ఫ్లైఓవర్‌పై వ్యాన్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. లారీ కేబిన్‌ పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. అతి కష్టమ్మీద క్షతగాత్రులను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు.



● జూలై 19న లావేరు మండలం అదపాక సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొంది. బస్సులో 20 మంది ప్రయాణికులు ఉండగా.. ఈ ప్రమాదంలో పదిమందికి గాయాలయ్యాయి. హైవే పక్కన లారీ టైరు మార్చుతుండగా విశాఖ నుంచి శ్రీకాకుళం వస్తున్న నాన్‌స్టాప్‌ బస్సు ఢీ కొట్టింది. దీంతో లారీ క్లీనర్‌ రెండు కాళ్లు విరిగిపోయాయి. ఆర్టీసీ డ్రైవర్‌ కేబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు, పోలీసులు అతి కష్టమ్మీద ఆయనకు బయటకు తీశారు.

● జూన్‌ 19న పలాసలో పాత జాతీయ రహదారి.. కిడ్నీ ఆసుపత్రి సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో ఎనిమిది మంది గా యపడ్డారు. పలాస మండలం రంగోయి గ్రామం నుంచి పలాసలోని బ్యాంకు పనిపై గ్రామైక్య మహిళలు ఆటోలు వెళ్తుండగా.. ప్రమాదం జరిగింది. కిడ్నీ ఆసుపత్రి జంక్షన్‌ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఆటో బోల్తా పడింది. క్షతగాత్రులను స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

● జూన్‌ 19న టెక్కలి మండలం విక్రంపురం సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో వెనుక లారీలోని డ్రైవర్‌తో పాటు క్లీనర్‌ దుర్మరణం చెందాడు.

● మే 28న టెక్కలి సమీపంలో జాతీయ రహదారిపై అంబులెన్స్‌ బోల్తా పడింది. విశాఖ నుంచి ఝార్కండ్‌కు మృతదేహంతో వెళ్తున్న అంబులెన్స్‌ అదుపు తప్పి రోడ్డుపై బోల్తా కొట్టింది. దీంతో మృతదేహంతో ఉన్న బంధువులు జాతీయ రహదారిపై ఆపసోపాలు పడ్డారు. అదృష్టవశాత్తూ ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదు.

● తాజాగా జూలై 30న.. రణస్థలం మండలం పైడిభీమవరం ఫ్లైఓవర్‌ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. కాకినాడ జిల్లా తుని నుంచి మందస మండలం కదుమసాయికి బైక్‌పై వస్తుండగా ప్రమాదం జరిగింది. బైక్‌ ఫ్లైఓవర్‌ గోడను ఢీకొట్టింది. దీంతో వెనుక కూర్చున్న హర్యాని అనే మహిళ మృతి చెందింది. బైక్‌ నడుపుతున్న జీవన్‌ 30 అడుగుల లోతులో వంతెన కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. రాత్రి 9 గంటల సమయంలో ఈ ఘటన జరగ్గా.. స్థానికులు ఉలిక్కిపడ్డారు. పైడిభీమవరం ఫ్లై ఓవర్‌ వద్ద విద్యుత్‌ దీపాలు వెలగక అంధకారం నెలకొంది. ఓ వైపు చీకటి.. మరోవైపు అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.



హర్యాని, జీవన్‌ (ఫైల్‌)

- జాతీయ రహదారిపై పెరుగుతున్న ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు
- వంతెనలు, సర్వీసు రోడ్ల వద్ద కానరాని సూచికలు
- చాలాచోట్ల వెలగని విద్యుత్‌ లైట్లు

(రణస్థలం)

జాతీయ రహదారులపై నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. జిల్లాలో రణస్థలం మండలం పైడిభీమవరం నుంచి ఇచ్ఛాపురం వరకూ 197 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. పైడిభీమవరం నుంచి నరసన్నపేట వరకూ ఆరు లేన్ల రహదారి 57 కిలోమీటర్ల మేర ఉంది. నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం వరకూ రహదారిని విస్తరించాల్సి ఉంది. రహదారి విస్తరణలో భాగంగా పైడిభీమవరం నుంచి నరసన్నపేట వరకూ 30 వంతెనలు నిర్మించారు. పరిమిత సంఖ్యలో యూటర్న్‌లు ఏర్పాటు చేశారు. అయితే ఇలా యూటర్న్‌ల వద్ద సూచిక బోర్డులు లేవు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. చాలా దూరం వెళ్లిన తరువాత తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే జాతీయ రహదారిపై చాలాచోట్ల లైట్లు కూడా వెలగకపోవడంతో.. చీకట్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

● 57 ప్రమాద స్పాట్లు..

ప్రమాదాలు నియంత్రించడానికి, ట్రాఫిక్‌ సమస్యలు పరిష్కరించేందుకే జాతీయ రహదారిని విస్తరించారు. కానీ రోడ్డు విస్తరణ తరువాత ప్రమాదాలు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వాహనాల అతివేగం, వేగ నియంత్రణ చర్యలు, పోలీసుల తనిఖీలు లేకపోవడం వల్లే ప్రమాదాలు పెరుగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో జాతీయ రహదారిపై 57 ప్రమాద స్పాట్లను గుర్తించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల్లోపు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్టు పోలీసులు సైతం గుర్తించారు. సర్వీసు రోడ్లు ప్రారంభం, ముగింపుల వద్ద భారీ బోర్డులు కనిపించేలా ఏర్పాటు చేయడం లేదు. చిన్నపాటి బోర్డులు ఏర్పాటు చేయడంతో వాహనదారులు గుర్తించడం లేదు. అందుకే జిల్లావ్యాప్తంగా హైవేపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

వెలగని విద్యుత్‌ లైట్లు..

జిల్లాలో జాతీయ రహదారికి సంబంధించి నరసన్నపేట వరకూ మాత్రమే ఆరు లేన్లుగా విస్తరించారు. దాదాపు 30 వంతెనల వద్ద, గ్రామాలకు వెళ్లే సర్వీసు రోడ్లు వద్ద దాదాపు 900 విద్యుత్‌ స్తంభాలను ఏర్పాటు చేశారు. వాటికి ఎల్‌ఈడీ విద్యుత్‌ లైట్లను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో ఇవి బాగానే వెలిగాయి. కానీ తరువాత నిర్వహణ బాగా లేకపోవడంతో వెలగడం లేదు. రణస్థలంలో అయితే రోడ్డు మధ్యలో వేసిన విద్యుత్‌ స్తంభం పక్కకు ఒరిగిపోయింది. ఎప్పుడు రోడ్డుపై పడుతుందో తెలియని పరిస్థితి. పైడిభీమవరం, బుడుమూరు, సుభద్రాపురం, తాళ్లవలస, ఎచ్చెర్ల, శ్రీకాకుళం సింహద్వారం, పెద్దపాడు, సింగుపురం, మడపాం వద్ద పూర్తిస్థాయిలో విద్యుత్‌ లైట్లు వెలగడం లేదు. చాలాచోట్ల ఈ దీపాలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫ్యూజు బాక్సులు సైతం అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఇప్పటికైనా జాతీయ రహదారి విభాగం అధికారులు వంతెనలు, సర్వీసు రోడ్ల వద్ద సూచికబోర్డులు, విద్యుత్‌ లైట్లు వేయాల్సిన అవసరముంది. ప్రమాదాల నివారణపై పోలీసులు కూడా దృష్టి సారించాల్సి ఉంది.

దివ్యాంగుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

● కేంద్రమంత్రి రామ్మోహన్‌ నాయుడు



కార్యక్రమానికి హాజరైన దివ్యాంగులు



ట్రైసైకిల్‌ పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌

అరసవల్లి, ఆగస్టు 3: దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పించి.. ఆర్థిక స్వావలంబన చేకూర్చడమే లక్ష్యంగా పనిచేస్తామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌ నాయుడు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఓ ప్రైవేటు హోటల్‌లో దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సామాజిక న్యాయం సాధికారత కేంద్ర మంత్రిత్వశాఖ, అలింకో సహకారంతో దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌ నాయుడు మాట్లాడుతూ.. 'జిల్లావ్యాప్తంగా 479 మందికి రూ.73.32లక్షల విలువైన 823 ఉపకరణాలను పంపిణీ చేశాం. ట్రైసైకిళ్లు(బ్యాటరీతో నడిచే), వినికిడి పరికరాలు అందజేశాం. దివ్యాంగులకు ప్రతినెలా రూ.6వేలు పింఛన్‌ ఇస్తున్న ఘనత మన ప్రభుత్వానిదే. దివ్యాంగులకు ఎప్పుడు ఎటువంటి సహాయం కావాలన్నా ముందుంటాం. స్కిల్‌ డెవలప్‌మెంట్‌ సెంటర్‌ ద్వారా వారికి ప్రత్యేక శిక్షణను అందించి, స్వయం ఉపాధి కల్పిస్తామ'ని తెలిపారు. ● కలెక్టర్‌ స్వప్నిల్‌ దినకర్‌ పుండ్కర్‌ మాట్లాడుతూ.. 'దివ్యాంగులు ఎందులోను ఎవ్వరికీ తీసిపోరు. ఆర్టీసీ బస్సుల్లో వారు సులువుగా ప్రయాణించేందుకు వీలుగా ర్యాంప్‌ల ఏర్పాటు వంటి మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తాం. కేంద్రమంత్రి సూచన మేరకు నెలలో ఒకరోజు దివ్యాంగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్‌ ఏర్పాటు చేస్తాం. అన్ని ప్రభుత్వ శాఖలు తమ నిధుల్లో కనీసం 2 శాతం ఖర్చు చేసేలా ఉత్తర్వులు జారీ చేస్తామ'ని తెలిపారు. ● విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీకాకుళం, నరసన్నపేట ఎమ్మెల్యేలు గొండు శంకర్‌, బగ్గు రమణ మూర్తి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి మొదటిసారిగా దేశంలో పింఛను పథకాన్ని టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌ ప్రవేశపెట్టారన్నారు. పింఛన్‌ను ప్రస్తుత సీఎం చంద్రబాబు మరింత పెంచి ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ కవిత, ఎన్‌వైకే కో-ఆర్డినేటర్‌ వెంకట్‌ ఉజ్వల్‌, మెప్మా పీడీ కిరణ్‌కుమార్‌, ఉపాధి కల్పనాధికారి సుధ, పర్యాటకశాఖ అధికారి నారాయణరావు, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్‌, అలింకో కో-ఆర్డినేటర్‌ రవిశంకర్‌, కింజరాపు వరప్రసాద్‌, దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణమూర్తి పాల్గొన్నారు.

ట్రిపుల్‌ ఐటీల్లో మిగులు సీట్లకు జాబితా విడుదల

ఎచ్చెర్ల, ఆగస్టు 3: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్‌ నాలెడ్జ్‌ టెక్నాలజీస్‌ (ఆర్జీయూకేటీ) పరిధిలో నాలుగు ట్రిపుల్‌ ఐటీల్లో మిగిలిన సీట్ల భర్తీకి రెండో విడత జాబితా విడుదలైంది. ఈ జాబితాను శనివారం ఆర్జీయూకేటీ సెట్‌ అడ్మిషన్ల కన్వీనర్‌ ఎస్‌.అమరేంద్రకుమార్‌ విడుదల చేశారని ఇక్కడి క్యాంపస్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. రెండో విడత కౌన్సెలింగ్‌లో నాలుగు క్యాంపస్‌ల్లో 753 సీట్ల భర్తీకి మెరిట్‌ ప్రాతిపదికన ఎంపిక చేసిన జాబితా.. వర్సిటీ వెబ్‌ సైట్‌ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డాట్‌ ఆర్జీయూకేటీ డాట్‌ ఇన్‌లో అందుబాటులో ఉంది. ఈ నెల 9న ఆర్కే వ్యాలీ, ఒంగోలు ట్రిపుల్‌ ఐటీలకు ఎంపికైన విద్యార్థులకు ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో కౌన్సెలింగ్‌ నిర్వహిస్తారు. నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్‌ ఐటీలకు ఎంపికైన విద్యార్థులకు నూజివీడు క్యాంపస్‌లో కౌన్సెలింగ్‌ ప్రక్రియ జరుగుతుంది. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 19,20 తేదీల్లో ఆయా క్యాంపస్‌ల్లో రిపోర్ట్‌ చేయాలి. ఈ నెల 21 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. దివ్యాంగులు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్‌ కోటాలో ఎంపికైన విద్యార్థుల వివరాలు వచ్చేవారంలో విడుదలవుతుంది' అని వారు తెలిపారు.

లబ్ధిదారుల కన్నా..
బినామీలే అధికం

- జగనన్న ఇళ్ల స్థలాల కేటాయింపులో అవకతవకలు
- ప్రభుత్వ ఉద్యోగులు కూడా నిర్మాణాలు చేపట్టిన వైనం
- స్థానిక వైసీపీ నాయకుడి తీరుపైనే అనుమానాలు
- రెవెన్యూ అధికారుల సర్వేతో బయటపడుతున్న వాస్తవాలు


వజ్రపుకొత్తూరు, ఆగస్టు 3: వజ్రపుకొత్తూరు మండలం గరుడుభద్ర సచివాలయ పరిధిలోని జగనన్న ఇళ్ల స్థలాల కేటాయింపులో అవతవకలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అసలైన లబ్ధిదారులకన్నా.. బినామీలే ఎక్కువగా ఉన్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం చర్చనీయాంశమైంది. దీనిపై సర్వే చేపట్టాలని గరుడుభద్ర, రాజాం పంచాయతీల టీడీపీ నేతలు సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం ఆర్‌ఐ పవిత్ర, సర్వేయర్‌ కె.తిరుపతిరావు ఆధ్వర్యంలో అధికారులు సర్వే చేపట్టారు. ఈ కాలనీలో 120 మందికి ఇళ్ల స్థలం కేటాయించగా.. 37మంది నిర్మాణాలు పూర్తిచేశారు. 83 మంది పునాదులు నిర్మించారు. ఇళ్ల నిర్మాణంలో మంజూరైన వారి పేర్లు కాకుండా కొత్తపేర్లు కనపడడంతో అధికారులు విస్తుపోయారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఈ కాలనీలో ఇళ్లు నిర్మించుకున్నట్టు అధికారుల దృష్టికి వచ్చింది. కొన్ని స్థలాలను విక్రయించినట్టు తెలిసింది. స్థానిక వైసీపీ నాయకుడే సూత్రధారిగా ఈ అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో ఇంటి స్థలాన్ని రూ.నాలుగు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకూ విక్రయించినట్టు తెలుస్తోంది. దీనిపై మరింత లోతుగా సర్వే.. పూర్తి స్థాయిలో అక్రమాలు బయటపడనున్నాయని స్థానిక టీడీపీ నేతలు పేర్కొంటున్నారు. అవకతవకలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేస్తున్నారు.

● ఈ విషయమై.. మండల సర్వేయర్‌ కె.తిరుపతి వద్ద ప్రస్తావించగా గరుడుభద్ర సచివాలయం పరిధి జగనన్న కాలనీలో బినామీల పేర్లు ఉన్నట్టు గుర్తించామన్నారు. స్థలాల కేటాయింపులో తేడాలు ఉన్నాయన్నారు. సర్వే చేపట్టిన తర్వాత ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.



గరుడభద్ర జగనన్న కాలనీలో సర్వే చేస్తున్న అధికారులు

కాటేస్తున్నాయ్‌



- పొలాల్లో పాముకాట్లకు రైతులు, కూలీలు బలి
- జిల్లా కేంద్రాసుపత్రిలో సౌకర్యాల్లేక ఇబ్బందులు
- దోచేస్తున్న కార్పొరేట్‌ ఆస్పత్రులు

● టెక్కలి మండలం కొల్లివలసకు చెందిన రైతుకూలీ కొసింటి అప్పలస్వామి బుధవారం రాత్రి పొలంలో పాముకాటుకు గురయ్యారు. కుటుంబ ఆయనను చికిత్స కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రికి వైద్యులు రిఫర్‌ చేశారు.

● టెక్కలి మండలం నర్సింగపల్లి పంచాయతీ కిట్టాలపాడు గ్రామానికి చెందిన పెద్దింటి బుడ్డు.. ఇటీవల పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటువేసింది. ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్‌- రిమ్స్‌)కు తరలించారు.



● కోటబొమ్మాళి మండలం పాకివలస గ్రామానికి చెందిన తోట మల్లేసు.. గురువారం పొలంలో పని చేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు.



● టెక్కలి మండలం మొఖలింగాపురం గ్రామానికి చెందిన జన్ని సాయమ్మ శుక్రవారం పాముకాటుకు గురైంది. కుటుంబ సభ్యులు ఆమెను టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతోంది.

(టెక్కలి/ నరసన్నపేట)

ఖరీఫ్‌ సీజన్‌ ఆరంభం వేళ.. పాములు కాటేస్తున్నాయి. రైతులు, కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నం కాగా.. చాలామంది పాముకాట్లకు గురవుతున్నారు. కొంతమంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోతున్నారు. మరికొంత మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రిలో గడిచిన మూడు నెలల్లో 182 పాముకాటు కేసులు నమోదయ్యాయి. అందులో 21 కేసులు మెరుగైన వైద్యం కోసం రిఫర్‌ చేశారు. పాముకాటుకు గురైన సందర్భాల్లో కొన్ని కేసులకు సంబంధించి ఐసీయూ, వెంటిలేటర్‌ సౌకర్యాలు ఉండాలి. అటువంటి సౌకర్యాలు టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రి లేక కొన్ని కేసులను మెరుగైన వైద్యసేవలు పేరుతో రిఫర్‌ చేస్తున్నారు. ఈ క్రమంలో కార్పొరేట్‌ ఆస్పత్రులు బాధితుల దగ్గర రూ.లక్షల్లో వసూలు చేస్తున్నాయి. ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు పొందే అవకాశం ఉన్నా.. చికిత్స ఆలస్యమైతే ప్రాణాలకే ముప్పు అంటూ భయపెడుతున్నాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎంత ఖర్చయినా.. చికిత్స చేయించుకుంటున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పాముకాటు బాధితులకు మెరుగైన చికిత్స అందించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఇవి ప్రమాదకరం..

వాస్తవానికి పాముల్లో.. నాగుపాము, నల్ల త్రాచు, కట్లపాము, రక్తపింజరి రకాలు అత్యంత ప్రమాదకరమైనవి. కట్లపాము కాటువేసిన క్షణంలోనే విషం రక్త కణాల్లో కలుస్తుంది. నాగుపాము కాటు వేస్తే.. 15 నిమిషాల్లో శరీరంలోకి విషం ఎక్కుతుంది. రక్త పింజరి కాటేసిన రెండు గంటల తర్వాత శరీరంలో విషం చేరుతుంది. కొన్నిరకాల పాములు కరిచిన తరువాత నాడీ వ్యవస్థ, రక్తప్రసరణపై ప్రభావం పడుతుంది. పాము కాటువేసే తీరును బట్టి విషపూరితమవుతుంది. విషపూరిత పాములు కరిస్తే కొందరికి గుండె, బ్రెయిన్‌, కిడ్నీలపై కూడా ప్రభావం చూపుతుంది. మరికొందరికి పక్షవాతం వచ్చే అవకాశం ఉంది. సకాలంలో వైద్యసేవలు అందిస్తే ప్రాణాలకు ముప్పు ఉండదు. పాముకాటు బాధితులకు వైద్యులు ఐదు నుంచి 30వరకు యాంటీ స్నేక్‌ వీనమ్స్‌ ఇస్తారు. ముందుగా రక్త నమూనాలు సేకరించి.. దానికి అనుగుణంగా అవసరమైన చికిత్సను అందజేస్తారు. 24గంటల పాటు వారి పర్యవేక్షణలో ఉంచుతారు. పాము కరిచిన తరువాత కొందరు పైకి రక్తప్రసరణ జరగకుండా ఆ ప్రాంతంలో తాడుతో కడతారు. వైద్యులు మాత్రం పాము కరిచిన ప్రాంతాన్ని కదపకుండా అరగంట వ్యవధిలో ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచిస్తున్నారు. సాధారణంగా 50 శాతం పాముల్లో విషం ఉండదు. తాచుపాము, కట్లపాము తదితర 15శాతం సర్పజాతులతోనే ప్రమాదం. పాము కాటు వేసిన తరువాత చాలామంది షాక్‌తోనే ప్రాణం మీదకి తెచ్చుకుంటున్నారు. కుటుంబ సభ్యులు, స్థానికులు ధైర్యం చెప్పి.. సకాలంలో ఆస్పత్రికి తరలిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చు అని వైద్యులు సూచిస్తున్నారు.

సకాలంలో చికిత్స..

జిల్లా కేంద్రాసుపత్రికి గడిచిన మూడు నెలల్లో 182 పాముకాటు కేసులు రాగా, అందులో మెరుగైన వైద్యం కోసం 21 కేసులు రిఫర్‌ చేశాం. పాముకాటుకు గురైన వ్యక్తిని సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లాలి. రక్తపరీక్షలు చేసి.. వైద్యసేవలు అందిస్తే బాధితులు ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడవచ్చు. పాముకాటు బాధితులకు యుద్ధప్రాతిపదికన వైద్య సేవలు అందిస్తున్నాం. మరీ విషమంగా ఉంటేనే.. రిఫర్‌ చేస్తున్నాం.

-డాక్టర్‌ మహరాజ్‌, జిల్లా కేంద్రాసుపత్రి వైద్యుడు, టెక్కలి

ఆంధ్ర యూనివర్సిటీలో
డిస్టెన్స్, ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లు



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(ఏయూ-సీడీఓఈ) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(ఎస్‌డీఈ)- ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్, ఆన్‌లైన్ మోడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు: బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. బీఎస్సీ ప్రోగ్రామ్‌ను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. మిగిలినవాటిని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో చదువుకోవచ్చు.

- **బీఎస్సీ గ్రూప్ సబ్జెక్టులు:** మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, బోటనీ, జువాలజీ
- **అర్హత:** బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూప్‌తో ఇంటర్/రెండేళ్ల ఐటీఐ/పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులు; వెటర్నరీ/అగ్రికల్చర్ డిప్లొమా పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏపీఓఎస్/ఎన్ఐఓఎస్ అభ్యర్థులు కూడా అర్హులే. బీఎస్సీ(ఎంపీసీ/ఎంపీసీఎస్/ఎంస్టాట్‌సీఎస్) కోర్సులకు పాలిటెక్నిక్ డిప్లొమా/ఇంటర్(ఎంపీసీ) ఉత్తీర్ణులు; మేథమెటిక్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు అర్హులు. బీఎస్సీ(సీబీజడ్) కోర్సుకు ఇంటర్(బైపీసీ)/డిప్లొమా(వెటర్నరీ/అగ్రికల్చర్) ఉత్తీర్ణులు; సైన్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు: ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** తెలుగు, ఇంగ్లీష్, ఎకనామిక్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హిస్టరీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, మేథమెటిక్స్
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు:** సైకాలజీ, మేథమెటిక్స్, బోటనీ, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, జువాలజీ
- **ఎంబీఏ స్పెషలైజేషన్‌లు:** హెచ్‌ఆర్‌ఎం, ఫైనాన్స్, మార్కెటింగ్
- **అర్హత:** ఎంసీఏలో ప్రవేశానికి బీటెక్(సీఎస్ఈ)/బీసీఏ ఉత్తీర్ణులు; ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఎస్సీ/బీకాం/బీఏ పూర్తిచేసినవారు; బీఏ/బీకాం ఉత్తీర్ణతతోపాటు ఏయూ నుంచి పీజీడీసీఏ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మిగిలిన ప్రోగ్రామ్‌లకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. (ఎంఏ/ఎమ్మెస్సీ)(మేథమెటిక్స్), ఎమ్మెస్సీ(బోటనీ/ఫిజిక్స్/ఆర్గానిక్ కెమిస్ట్రీ/జువాలజీ), ఎంఏ(హిందీ) ప్రోగ్రామ్‌లకు మాత్రం డిగ్రీ స్థాయిలో సంబంధిత స్పెషలైజేషన్ సబ్జెక్ట్ చదివి ఉండాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.andhrauniversity-sde.com

జేఎన్‌టీయూకేలో స్పాన్సర్డ్ ఎంటెక్

కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- స్పాన్సర్డ్ కేటగిరీ కింద ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. కాకినాడ, నర్సరావుపేట క్యాంపస్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. అకడమిక్ మెరిట్, గేట్ 2024/జీప్యాట్ 2024/పీజీఈసెట్ 2024 ర్యాంక్, అనుభవం, కౌన్సెలింగ్‌ల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్పెషలైజేషన్‌కు అయిదు సీట్లు చొప్పున మొత్తం 125 సీట్లు ఉన్నాయి. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌లు, స్టయిపెండ్ లభించవు.

ఎంటెక్ విభాగాలు-స్పెషలైజేషన్‌లు: సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్, బయోటెక్నాలజీ, నానోటెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఏవియానిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ.

అర్హత: ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి సంబంధిత ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్/ఏఎంఐఈ పూర్తిచేసి ఉండాలి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ప్రకారం ఎంసీఏ లేదా ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్/స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/జియో ఫిజిక్స్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్/కెమిస్ట్రీ/బయో కెమిస్ట్రీ/మైక్రోబయాలజీ/బయోటెక్నాలజీ/లైఫ్ సైన్సెస్/ఎర్త్ సైన్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/డెయిరీ టెక్నాలజీ) ఉత్తీర్ణులు; ఎంబీబీఎస్/బీడీఎస్/బీ ఫార్మసీ/బీవీఎస్సీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ/పీజీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. గేట్ 2024/జీప్యాట్ 2024/పీజీఈసెట్ 2024 అర్హత తప్పనిసరి. అభ్యర్థులకు కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **సెమిస్టర్ ఫీజు:** రూ.25,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 23
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

దిక్సూచి DIKSUCHI

బయోటెక్నాలజీ, సైన్సెస్ విభాగాల్లో పీజీ చేయాలనుకొనే వారి కోసం ఉద్దేశించిన 'జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్(జామ్) 2025' షెడ్యూల్ వెలువడింది. దీనిని ఈ ఏడాది ఐఐటీ ఢిల్లీ నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ద్వారా ఎమ్మెస్సీ; ఎమ్మెస్సీ(టెక్); ఎంఎస్(రీసెర్చ్); జాయింట్/డ్యూయల్ డిగ్రీ ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ; ఎమ్మెస్సీ-ఎంటెక్ డ్యూయెల్ డిగ్రీ; ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న 21 ఐఐటీలు అందిస్తున్న వివిధ పీజీ ప్రోగ్రామ్‌లలో సుమారు 3000 సీట్లను జామ్ స్కోర్ ద్వారా నేరుగా భర్తీ చేస్తారు. అలాగే నిట్ సంస్థలు, ఐసర్లు, ఐఐఎస్సీ, ఐఐఈఎస్‌టీ, డీఐఏటీ, ఐఐపీఈ, జేఎన్‌సీఏఎస్ఆర్, ఎస్‌ఎల్ఐఈటీ సహా ప్రముఖ సీఎఫ్‌టీఐ సంస్థల్లో 2300కు పైగా ఉన్న సీట్ల భర్తీకి కూడా ఈ స్కోరునే ప్రామాణికంగా తీసుకుంటారు.

సైన్స్ పీజీల్లో ప్రవేశానికి జామ్

జామ్ పేపర్లు: జామ్ ఎగ్జామ్‌ను ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో నిర్వహిస్తారు. ఉదయం సెషన్‌లో కెమిస్ట్రీ, జియాలజీ, మేథమెటిక్స్ పేపర్లు; మధ్యాహ్నం సెషన్‌లో బయోటెక్నాలజీ, ఎకనామిక్స్, మేథమెటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్ పేపర్లు ఉంటాయి. అభ్యర్థులు గరిష్ఠంగా రెండు పేపర్లు రాయవచ్చు. రెండు పేపర్లు రాసేవారు ఉదయం సెషన్ నుంచి ఒక పేపర్, మధ్యాహ్నం సెషన్ నుంచి మరో పేపర్ ఉండేలా చూసుకోవాలి. పేపర్లకు నిర్దేశించిన సిలబస్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. కెమిస్ట్రీ పేపర్ సిలబస్ మారినందున దానిని త్వరలోనే అప్‌లోడ్ చేస్తారు.

అర్హత: అభ్యర్థి జామ్‌లో ఎంచుకొన్న పేపర్/పేపర్లను అనుసరించి సంబంధిత సబ్జెక్టులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు; సంబంధిత ఇండియన్ డిగ్రీ పూర్తిచేసిన విదేశీ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. ఒక అభ్యర్థి ఎన్నిసార్లయినా జామ్ ఎగ్జామ్ రాయవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** సెప్టెంబరు 3
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 11
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** 2025 జనవరిలో
- **జామ్ 2025 ఎగ్జామ్ తేదీ:** 2025 ఫిబ్రవరి 2
- **వెబ్‌సైట్:** jam2025.iitd.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/gudU4Skలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



యుద్ధానికి సిద్ధం

అడివిశేష్ హీరోగా నటించిన 'గూఢచారి' సినిమాకి కొనసాగింపుగా వస్తోన్న చిత్రం 'గూఢచారి 2'. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్, అనిల్ సుంకర నిర్మిస్తున్నారు. 'గూఢచారి' చిత్రం విడుదలై ఆరేళ్లు అవుతున్న సందర్భంగా పార్ట్ 2 నుంచి ఆరు స్టైలిష్ యాక్షన్ స్టిల్స్‌ను శనివారం యూనిట్ విడుదల చేసింది. 'గూఢచారి 2' భారీ స్థాయిలో అంతర్జాతీయ ప్రమాణాలతో తెరకెక్కుతోంది' అని శేష్ చెప్పారు. ఇప్పటికే 40 శాతం షూటింగ్ పూర్తయిందని నిర్మాతలు తెలిపారు.



రెడ్‌కార్పెట్ లుక్

'69వ శోభా ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ 2024' వేడుక శనివారం రాత్రి హైదరాబాద్‌లో అట్టహాసంగా జరిగింది. హీరోలు నాని, సుధీర్‌బాబు, సందీప్ కిషన్, అల్లు శిరీష్, నవీన్ పొలిశెట్టి, సిద్ధార్థ్... హీరోయిన్లు పాయల్ రాజ్‌పుత్, ఐశ్వర్యా రాజేశ్, జ్యోతిక, నభానటేశ్, రాశీఖన్నా, ప్రియమణి తదితరులు పాల్గొన్నారు.

లావణ్యే డ్రగ్స్ అలవాటు చేసింది

● రాజ్‌తరుణ్ మాజీ ప్రియురాలిపై కేసు



రాజ్‌తరుణ్, ఆయన మాజీ ప్రియురాలు లావణ్య మధ్య నడుస్తున్న వివాదం కొత్త మలుపు తీసుకుంది. లావణ్య తనకు డ్రగ్స్ అలవాటు చేసిందంటూ ప్రీతీ అనే యువతి నార్సింగి పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. 'లావణ్య ఇప్పటికే చాలామంది అమ్మాయిలకు డ్రగ్స్ అలవాటు చేసింది, తరచూ నాకు ఫోన్‌చేసి బెదిరిస్తోంది, ఆమెవల్ల ఇప్పటికే చాలా జీవితాలు నాశనం అయ్యాయి' అని ప్రీతి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై సుఖేందర్‌రెడ్డి తెలిపారు. డ్రగ్స్ విషయంలో అడ్డు చెప్పడం వల్లే ఆమె రాజ్‌తరుణ్‌పై కక్ష పెంచుకుందని ఆయన తరపు లాయర్ మధుశర్మ చెప్పారు.

వయనాడ్ విలయం... సినీతారల సాయం



కేరళ సీఎం సహాయక నిధికి రూ. 25 లక్షల సాయం అందించిన మలయాళ నటుడు మోహన్‌లాల్ సహాయక చర్యల్లో సైతం పాల్గొని తన గొప్ప మనసు చాటుకున్నారు. టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్‌గా కొనసాగుతున్న ఆయన ఆ హోదాలో దగ్గరుండి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. వయనాడ్‌లోని ఆర్మీ బేస్ క్యాంప్‌లో ఆయన సైనికులను కలిశారు. తాత్కాలిక బ్రిడ్జిల నిర్మాణం లాంటి కార్యక్రమాల్లో సైనికులతో కలసి పాల్గొన్నారు. 'మీరు రీల్ హీరో కాదు రియల్ హీరో' అంటూ నెటిజన్లు మోహన్‌లాల్‌ను ప్రశంసిస్తున్నారు.

నటీనటుల విరాళాలు



భారీ వరదలు, కొండ చరియలు విరిగిపడి తీవ్రంగా నష్టపోయిన వయనాడ్ ప్రాంతంలో సహాయ, పునరావాస కార్యక్రమాలకు తమవంతు సాయం అందించేందుకు తారాలోకం నడుంకట్టింది. పలువురు నటీనటులు ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు ఇస్తున్నారు. టాలీవుడ్ కథానాయిక రష్మిక మందన్న రూ. 10 లక్షలు, నిర్మాత సూర్యదేవర నాగవంశీ రూ. 5 లక్షలు విరాళంగా ఇచ్చారు. తమిళ నటులు సూర్య, కార్తి, జ్యోతిక కలిసి రూ. 50 లక్షలు ఇవ్వగా, కమల్‌హాసన్ రూ. 25 లక్షలు, విక్రమ్ రూ. 20 లక్షలు ఇచ్చారు. దుల్కర్ సల్మాన్ రూ. 10 లక్షలు, మమ్ముట్టి రూ. 15 లక్షలు, ఫహద్‌ఫాజిల్, నజ్రియా దంపతులు రూ. 25 లక్షలు విరాళంగా అందించారు.



సక్సెస్



థియేటర్లు పెరుగుతున్నాయి

రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా రూపొందిన 'తిరగబడరా సామీ' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విజయోత్సవంలో నిర్మాత మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ 'మొత్తం 200 థియేటర్లలో విడుదల చేశాం. ఈ రోజు మరో 20 థియేటర్లు పెరిగాయి. మా సినిమాకు మంచి రిపోర్ట్ వచ్చింది. దర్శకుడు రవికుమార్ చౌదరి అద్భుతంగా తీశారు. లేడీ విలన్‌గా మన్నారా చోప్రా చక్కగా నటించింది' అన్నారు. మంచి సినిమాను ఏదీ అడ్డుకోలేదని ప్రేక్షకులు నిరూపించారని దర్శకుడు రవికుమార్ చౌదరి చెప్పారు.

ప్రేక్షక దేవుళ్లు కరుణించారు



'ఒక కొత్త హీరో నటించిన సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. 'ప్రేక్షక దేవుళ్లు' అని ఎందుకు అంటారో నాకు ఇప్పుడు అర్థమైంది' అన్నారు 'అలనాటి రామచంద్రుడు' చిత్ర హీరో కృష్ణవంశీ. శుక్రవారం విడుదలైన ఈ చిత్రానికి మంచి ఆదరణ లభించిందని శనివారం నిర్వహించిన థాంక్స్ మీట్‌లో వెల్లడించారు. ఈ చిత్ర నిర్మాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్మాత శ్రీరామ్ జడపోలు కృతజ్ఞతలు తెలిపారు.



రెస్పాన్స్ బాగుంది

'చాలా రోజుల తర్వాత ఒక క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను చూశామని ప్రేక్షకులు అంటుంటే ఆనందంగా ఉంది' అన్నారు దర్శకుడు విజయ్‌భాస్కర్. శ్రీకమల్, తాన్వీ ఆకాంక్ష జంటగా రూపొందిన 'ఉషా పరిణయం' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ నేపథ్యంలో శనివారం ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో చిత్రనిర్మాత, దర్శకుడు విజయభాస్కర్ మాట్లాడుతూ 'కలెక్షన్లు నెమ్మదిగా పెరుగుతున్నాయి. రెస్పాన్స్ బాగుంది. ఇలాంటి చిన్న సినిమాలను ఆదరిస్తే మరిన్ని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లు వస్తాయి' అన్నారు





మూణ్నాళ్ల ముచ్చటే..

- శివారు భూములకు నిలిచిపోయిన వంశధార నీరు
- ఎండిపోతున్న వరినారు


ఉదయపురం వద్ద కాలువలో నీరు లేని దృశ్యం

సంతబొమ్మాళి, ఆగస్టు 3: మండలంలోని 25ఆర్ మేఘవరం కాలువకు సాగునీరు మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఈ కాలువ ద్వారా సకాలంలో సాగునీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోయారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు స్థానిక శాసనసభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు వ్యవసాయమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే యుద్ధ ప్రాతిపదిక 25ఆర్ మేఘవరం కాలువతో పాటు గరీబులగెడ్డ చానల్ మరమ్మతులు చేపట్టారు.దీంతో వంశధార నీరు విడిచిపెట్టిన రెండుమూడు రోజుల్లోనే ఈ కాలువల ద్వారా సాగునీరు శివారు ప్రాంతాలకు రావడంతో రైతుల కళ్లలో ఆనందం కనిపించింది. వైసీపీ పాలనలో ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నోసార్లు వినతిపత్రాలు ఇచ్చినా కానరాని సాగునీరు మంత్రిగా అచ్చెన్నాయుడు బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో శివారు ప్రాంతాలకు నీరు చేరిందని సంబరపడ్డారు. వందల ఎకరాల్లో ఎదలు వేసుకోగా, మరికొంత మంది ఉభాల కోసం వరినారు వేసుకున్నారు. అయితే గత వారం రోజులుగా 25ఆర్ మేఘవరం కాలువ ద్వారా సాగునీరు రాకపోవడంతో బోరుభద్ర, గొదలాం, సీపురం, గంటపేట, మలగాం, ఉదయపురం ప్రాంతాలకు సాగునీరు నిలిచిపోయింది. దీనికి తోడు వర్షాలు కూడా కురవకపోవడంతో వరినారు, ఎదలు ఎండిపోతున్నాయి. వంశధార అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో 25ఆర్ మేఘవరం కాలువకు సాగునీరు అందడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సక్రమంగా నీరు అందించి తమ పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.


నీరు అందక ఎండిపోతున్న వరి ఎదలు

నేటి నుంచి జీడి పరిశ్రమలు పునఃప్రారంభం

పలాస: పలాస-కాశీబుగ్గలో జీడి పరిశ్రమలు ఆదివారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. జీడి పప్పు మార్కెట్‌లో ఒడిదొడుకులు కారణంగా గత నెల 19 నుంచి పరిశ్రమలు బంద్ పాటించాయి. 15 రోజులు బంద్ పాటించినా జీడి పప్పు అమ్మకాల్లో వృద్ధి రాలేదని, కార్మికులు, వ్యాపారుల శ్రేయస్సు దృష్ట్యా బంద్ విరమిస్తున్నామని పలాస జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్, కార్యదర్శి కేవీ శివకృష్ణ, కోశాధికారి పట్నాన రవికాంత్ తెలిపారు.

నేడు జనసేన సభ్యత్వ నమోదు

పిన్నింటిపేట(పోలాకి): పిన్నింటిపేటలో ఆదివారం జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు పార్టీ నాయకుడు మెట్ట వైకుంఠరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సభ్యత్వ రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.500 ప్రమాద బీమా చెల్లిస్తే రూ.5లక్షల బీమా పరిహారంగా పార్టీ అందజేస్తుందని తెలిపారు. ఇతర వివరాలకు 8919596497 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు

రేషన్ సక్రమంగా అందుతుందా?

మందస: మందసలో రేషన్ పంపిణీని పలాస ఆర్డీవో భరత్‌నాయక్ శనివారం పరిశీలించారు. రేషన్ సరుకులు సక్రమంగా అందుతున్నాయా? లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. బియ్యం నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట డీటీ కృష్ణమూర్తి, సివిల్‌సప్లయి డీటీ ఎస్.రవికుమార్ ఉన్నారు.

ఈ క్రాప్‌లో పంటలు నమోదు చేయాలి

నరసన్నపేట: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేయాలని ఏడీఏ రవీంద్రభారతి సచివాలయ వ్యవసాయ సిబ్బందికి సూచించారు. శనివారం ఈ క్రాప్ నమోదుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంట నమోదులో తేడా లేకుండా ఉండాలన్నారు. ఈ క్రాప్‌లో నమోదైన పంటలకు ప్రభుత్వం బీమా చెల్లించడంతో పాటు కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో సునీత తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపుల పరిశీలన

నరసన్నపేట: మండలంలోని పోతయ్యవలస, మడపాం, చేనులవలస, లుకలాం ఇసుక ర్యాంపులను తహసీల్దార్ టి.సత్యనారాయణ శనివారం పరిశీలించారు. ఉచిత ఇసుక పంపిణీకి ప్రభుత్వ ఆదేశాలు ఇవ్వడంతో వీటిని పరిశీలించారు. రాత్రి సమయంలో అక్రమ రవాణా జరగకుండా వీఆర్వోలతో కమిటీ వేస్తామని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ లోకేశ్, మండల సర్వేయరు అప్పలస్వామి, ఏఎస్ఐ అసిరినాయుడు తదితరులు ఉన్నారు.

చేనేత వస్త్రాలను ధరించాలి

నరసన్నపేట: ప్రజలు చేనేత వస్త్రాలను ధరించేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.లత అన్నారు. చేనేత వస్త్రాల వారోత్సవాల్లో భాగంగా శనివారం కళాశాల విద్యార్థులు స్థానిక బొంతలవీధిలోని చేనేత కళాకారుల ఇళ్లను సందర్శించారు. మగ్గం, నూలు వడుకుట, వస్త్రాల తయారి విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డా.అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లకే రేషన్ అందించాలి

వజ్రపుకొత్తూరు: వాహనాలతో రేషన్ పంపిణీ చేసే బదులు ఇళ్లకే వచ్చి నేరుగా సరుకులు అందించే విధంగా చర్యలు చేపట్టాలని వివిధ గ్రామస్థులు అధికారులను కోరారు. బైపల్లి, బాతుపురం, అక్కుపల్లి, మెట్టూరు, రాజాం చీపురుపల్లిలో రేషన్ సరుకుల పంపిణీని డీటీ వి.గిరిరాజు శనివారం పరిశీలించారు. రేషన్ పంపిణీ తీరుపై లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ పవిత్ర, వీఆర్వోలు ఇందిరా, వెంకటరావు ఉన్నారు.

పింఛన్ల బదిలీకి అవకాశం

ఎల్.ఎన్.పేట: పింఛన్లను ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి బదిలీ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎంపీడీవో జి.గిరిబాల అన్నారు. దీనికోసం పింఛన్‌దారులు తమ పరిధిలోని సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పింఛన్ ఐడీతో పాటు ఏ ప్రాంతానికి బదిలీ చేసుకోవాలనుకుంటున్నారో ఆ జిల్లా, మండలం, సచివాలయం పేర్లను దరఖాస్తులో పొందుపరచాలని సూచించారు.

ముకుందాపురంలో 'పొలంబడి'

మెళియాపుట్టి: ముకుందాపురంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. సేంద్రియ ఎరువులను అధికంగా వినియోగించేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి దానకర్ణుడు తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధనే లక్ష్యంగా పొలంబడి నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

9న క్విట్ కార్పొరేట్ కార్యక్రమం

కాశీబుగ్గ: సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఈ నెల 9న క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మోర్చా నాయకులు సీహెచ్ వేణుగోపాల్, వంక మాధవరావు ,గణపతి, భీమారావు అన్నారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి కార్పొరేట్లను ఈ దేశం నుంచి తరమాలని పిలుపునిచ్చారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

నందిగాం: నందిగాం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ ఆర్.జనార్ధనరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సర్పంచ్ ఎస్.జానకిరాం, పి.చలపతిరావు, ఎం.భావనకుమార్, ప్రసాదరావు, పి.రవికుమార్, ప్రదీప్‌కుమార్ పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్‌హెడ్ చానళ్ల ద్వారా సాగునీరు

- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట/జలుమూరు: ఓపెన్‌హెడ్ చానళ్ల ద్వారా శివారు ప్రాంతాలకు సాగునీరు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. శనివారం నరసన్నపేట మండలం నడగాం గ్రామం వద్ద పోలాకి ఓపెన్ హెడ్ చానల్ రెగ్యులేటర్లు, షట్టర్ల పనులు, జలుమూరు మండలం పర్లాం వద్ద ఎర్త్, జంగిల్ క్లియరెన్స్ పనులను ఆయన ప్రారంభించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఓపెన్ హెడ్ చానళ్ల ద్వారా నరసన్నపేట, పోలాకి, జలుమూరు మండలాల పరిధిలోని దిగువ ప్రాంతాల్లో ఉన్న 16వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జల్లు చంద్రమౌళి, మెండ రాంబాబు, రాడ శ్రీనివాసరావు, ఉత్తర కుమార్, కింజరాపు సత్యం, నీటిపారుదుల శాఖ అధికారులు పాల్గొన్నారు. ●నరసన్నపేట శాంతామణి, మత్స్యకార సొసైటీ నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే రమణమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యవర్గ సభ్యులను ఆయన సన్మానించారు.


నడగాం వద్ద పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

117 జీవోను రద్దుచేయాలి

ఎల్.ఎన్.పేట: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలంటే తప్పనిసరిగా 117 జీఓను రద్దుచేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.శ్రీరామచంద్రమూర్తి అన్నారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ వైవీ పద్మావతి, ఎంఈవో-2 కె.చంద్రమౌళి, మండల పంచాయతీ విస్తరణాధికారి ఐ.పద్మజ వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని, ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీషు మీడియంలను సమాంతరంగా నడపాలని, ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతులతో పాటు ఎల్‌కేజీ, యూకేజీలను కలపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు ఎస్.జయరాం, మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు చిన్నారావు, ఢిల్లీశ్వరరావు, గౌరవాధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పోలాకి:** 117 జీవో రద్దుచేయాలని కోరుతూ ఎంపీడీవో కె.ఉషశ్రీ, ఎంఈవోలు శ్రీనివాసనాయక్, లింగరాజు, తహసీల్దార్ ఎం.సురేష్‌కుమార్‌కు యూటీఎఫ్ నాయకులు వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో రాజేష్, ఉమాభాస్కర్, శ్యామలరావు, తదితరులు పాల్గొన్నారు.


ఎల్ఎన్‌పేట:తహసీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

సమయపాలన పాటిస్తేనే సత్ఫలితాలు

పెద్దకొల్లివలస(ఎల్.ఎన్.పేట): ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తే తప్పనిసరిగా సత్ఫలితాలు సాధించవచ్చని తహసీల్దార్ వైవీ పద్మావతి అన్నారు. పెద్దకొల్లివలస గ్రామసచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం ఆమె పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులు సకాలంలో కార్యాలయానికి వచ్చి ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. వారి హాజరుపట్టిక, మూమెంట్ రిజిష్టర్‌ను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సక్రమంగా సరుకులు అందజేయాలన్నారు. పంపిణీలో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం విద్యార్థులకు పెట్టాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్.గవరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

కోటబొమ్మాళి: రైతులు భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులు వాడాలని రైతు రక్షణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ టి.త్రినాథస్వామి అన్నారు. శనివారం ఎత్తురాళ్లపాడు గ్రామ రైతులకు ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. దమ్ములో ఒక ఎకరాకు ఒక బస్తా డీఏపీ, 20 కిలోల పొటాష్, 10 కిలోల యూరియా వేసుకోవాలన్నారు. నాట్లు వేసిన 20 రోజుల తరువాత ఎకరాకు 20 కిలోల యూరియా, పొట్ట దశలో 30 కిలోల యూరియా, 15కిలోల పొటాష్ కలుపుకొని జల్లుకోవాలని సూచించారు. రైతు శిక్షణ కేంద్రం సహాయ సంచాలకుడు కె.కృష్ణారావు, మండల వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు, వీఏఏ జి.గురునాథ్, రైతులు పాల్గొన్నారు.


రైతులకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయాధికారులు

ఆరోగ్యవంతమైన ఆహార ఉత్పత్తే లక్ష్యం

టెక్కలి: ఆరోగ్యవంతమైన ఆహార ఉత్పత్తే పొలంబడి లక్ష్యమని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ఉపసంచాలకుడు కె.త్రినాథస్వామి అన్నారు. స్థానిక సబ్‌డివిజన్ కార్యాలయంలో వివిధ మండలాల వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రాల సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, అభ్యుదయ రైతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఉత్తమ సాగు పద్ధతులతో పొలంబడి నిర్వహించాలన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకుడు కూటికుప్పల కృష్ణారావు, అధికారులు రంగారావు, గోవిందరావు, అప్పారావు, శ్రీకాంత్‌వర్మ, రవికుమార్, సత్యప్రియ, సురేష్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరిస్తాం

మెళియాపుట్టి: ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. శనివారం ఫీల్డ్ అసిస్టెంట్లు ఆయన్ను ఘనంగా సన్మానించారు. వేతనదారులందరికీ పనికల్పించాలని, ప్రజలకు ఉపయోగకరమైన పనులు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కరరావు, ఏపీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

గ్రామ సచివాలయ మెట్ల ధ్వంసంపై ఫిర్యాదు

సంతబొమ్మాళి: మేఘవరం గ్రామ సచివాలయం వెనుక భాగంలో ఉన్న మెట్లు, ప్రధాన ర్యాంప్ మార్గంలో ఏర్పాటు చేసి టైల్స్‌ను అదే గ్రామానికి చెందిన పనసాన వెంకటరెడ్డి, అతని భార్య కుమారి ధ్వంసం చేశారని సర్పంచ్ పరపటి సునీత పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు గతంలో సర్వే నెంబరు 14-9లో రెండు సెంట్ల ఇంటి స్థలాన్ని అధికారులు కేటాయించారని, వైసీపీ నాయకులు దౌర్జన్యంగా తన స్థలంలో సచివాలయం నిర్మించారని వెంకటరెడ్డి తెలిపాడు. ఆ స్థలంలో ఎవరికీ పట్టా ఇవ్వలేదని అప్పటి తహసీల్దార్ ఇచ్చిన ఎండాస్‌మెంట్ మేరకే అక్కడ సచివాలయం నిర్మించినట్లు సర్పంచ్ చెప్పారు. ప్రభుత్వ ఆస్తి ధ్వంసం చేసినందుకు వెంకటరెడ్డి, కుమారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సభ్యత్వ నమోదు లక్ష్యం అధిగమిస్తాం

కోటబొమ్మాళి: టెక్కలి నియోజకవర్గంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని అధిగమిస్తామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్ అన్నారు. శనివారం కోటబొమ్మాళిలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టెక్కలి నియోజకవర్గంలో 5వేల సభ్యతాలు లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు 4 వేలు చేసినట్లు తెలిపారు. మరో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి పల్లి కోటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు పాగోటి అనిల్‌కుమార్, నాయకులు తెలగవలస ప్రసాద్, ఇలపండు రమేష్, సందీప్, సీగారి రాజేష్, సంతోష్, కుమారు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 1 నుంచి పశుగణన

టెక్కలి: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1 నుంచి డిసెంబరు వరకు అఖిల భారత పశుగణన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ వి.జయరాజ్ తెలిపారు. జిల్లాలో 5,78,182 గృహాలు ఉన్నాయని, ప్రతి ఇంటినీ ఎన్యూమరేటర్లు సందర్శిస్తారని చెప్పారు. దీనికోసం 437 మంది ఎన్యూమరేటర్లు, 75మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 4.56లక్షల ఆవులు, 40వేల గేదెలు, 9లక్షలకు పైగా గొర్రెలు, మేకలు, 19.6లక్షల కోళ్లు ఉన్నట్లు చెప్పారు.

విద్యార్థులతో ప్రయోగాలు చేయించాలి

నరసన్నపేట: ఇంటర్ సైన్సు విద్యార్థులతో ప్రయోగాలను చేయించాలని ఆర్ఐవో పి.దుర్గారావు అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలను ఆయన సందర్శించారు. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు ప్రథమ సంవత్సరం నుంచే విద్యార్థులతో ప్రయోగాలు చేయించాలని, ఇందుకు అవసరమైన ల్యాబ్‌లు, పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్యామసుందరరావు, ఫల్గుణరావు, కళాశాల ప్రిన్సిపాల్ పార్వతి ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు వెబ్ ఆప్షన్ నమోదు

నరసన్నపేట: ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి విద్యార్థులకు వెబ్ ఆప్షన్ నమోదుకు ఉన్నత విద్యామండలి అవకాశం కల్పించింది. దీంతో విద్యార్థులు ఆ ప్రక్రియలో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది డిగ్రీలో ప్రవేశానికి సుమారు 8 వేల మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ నెల 5 వరకు వెబ్ ఆప్షన్‌కు ఉన్నత విద్యామండలి అవకాశం ఇచ్చింది.

కళింగ కోమట్లను ఓబీసీలో చేర్చాలి

నరసన్నపేట: కళింగ కోమట్లను ఓబీసీలో చేర్చాలని నరసన్నపేట కళింగ కోమట్ల సంఘ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శనివారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు తన క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జామి వెంకట్రావు, ఉణ్న వెంకటేశ్వరరావు, వారణాశి మురళీ తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన ఉండాలి

పలాసరూరల్: గిరిజనులకు హక్కులపై అవగాహన ఉండాలని మండల లీగల్‌సెల్ చైర్‌పర్సన్, జూనియర్ సివిల్ న్యాయాధికారి యు.మాధురి అన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం లొత్తూరు, పెంటిభద్ర గ్రామాల్లో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యులు సునీల్, మౌనిక, సాయికిరణ్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పిండి వెంకట్రావు, జాయింట్ సెక్రటరీ జీఎంఎస్‌అనిల్‌రాజ్, దేవరాజ్, చిట్టిబాబు, శ్యామ్, రవికుమార్ పట్నాయక్ పాల్గొన్నారు.





ఉపాధి పనులపై విచారణ

జలుమూరు: ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగాయని అందిన ఫిర్యాదు మేరకు ఏపీడీ మురళీకృష్ణ శనివారం విచారణ చేపట్టారు. 2022-2లో రూ.6.28 లక్షలు, 2023-24లో రూ.3.24 లక్షలతో ఉట్రబందలో ఉపాధి పనులు జరిగినట్లు అధికారులు చెప్పా రని, కానీ అక్కడ ఏ పనులు జరగలేదని జలుమూరుకు చెందిన కోలా తిరుపతిరావు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఏపీడీ మురళీకృష్ణ స్థానిక గ్రామ సచివాలయంలో వేతనదారులతో మాట్లాడి వివరా లు సేకరించారు. నివేదికను జిల్లా అధికారులకు అందిస్తామన్నారు. ఈ విచారణలో ఏపీవో శేఖర్ పాల్గొన్నారు.


విచారణ చేపడుతున్న ఏపీడీ మురళీకృష్ణ

విద్యార్థిని ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టాలి

నందిగాం: నందిగాం గురుకుల పాఠశాలలో ఇంటర్ విద్యార్థిని లిమ్మక అక్షిత ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టాని ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు కోరారు. శనివారం గురుకులాన్ని సందర్శించి వైస్ ప్రిన్సిపాల్ వాణి, ఉపాధ్యాయులకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్షిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఆయన వెంట ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధ్యక్షుడు యర్ర గడ్డయ్య దళిత ప్రతినిధి చింతాడ శ్రీనివాస్ ఉన్నారు.

హక్కుల కోసం పోరాటం చేయాలి

పలాసరూరల్: ఆదివాసీ హక్కుల కోసం పోరాటం చేయాలని అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు, ఉపాధ్యక్షుడు సవర బంగ్లా పిలుపునిచ్చారు. లొత్తూరు పంచాయతీ హల్దీగాంలో ఈ నెల 9న జరగనున్న ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కరపత్రాలను విడుదల చేశారు. ప్రభుత్వాలు ఆదివాసీల హక్కులను కాలరాస్తూ, భూములను కార్పొరేట్ శక్తులకు అందజేస్తున్నాయని, దీనిపై ప్రతీ ఆదివాసీ పోరాటం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీలు సవర రంగారావు, మహిళలు పాల్గొన్నారు.

చిన్నతరహా పరిశ్రమలపై పుస్తకావిష్కరణ

టెక్కలి: కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులు డాక్టర్ కొప్పల వేణుగోపాల్ రివర్స్ లాజిస్టిక్స్ ఫర్ స్మాల్ బిజినెస్ అనే అంశంపై రచించిన పుస్తకాన్ని డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు శనివారం ఆవిష్కరించారు. వ్యాపార, వాణిజ్య రంగాల వారికి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ పుస్తకం మార్గదర్శకంగా ఉంటుందని డైరెక్టర్ నాగేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, హెచ్‌వోడీ శివకుమార్ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల బిల్లులు పెట్టండి

పాతపట్నం: వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించిన వారి బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఎంపీడీవో కె.రామకృష్ణరాజు అన్నారు. శనివారం తన కార్యాల యంలో హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎప్పటికప్పుడు రికార్డు చేసిన బిల్లులు ఆన్‌లైన్‌లో పెట్టాలని ఆదేశించారు. అనంతరం గంగువాడ, పెద్దమల్లిపురం గ్రామాల్లో ఐహెచ్‌హెచ్‌ఎల్ నిర్మాణాలను పరిశీలించారు.

క్రికెట్ క్రీడాకారిణికి ఆర్థిక సాయం

టెక్కలి: పెద్దసాన గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారిణి జి.రోహిణికి గ్రామస్థులు శనివారం రూ.18వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ నెల 6 నుంచి 9 వరకు హర్యానాలో జరగనున్న క్రికెట్ పోటీల్లో రోహిణి పాల్గొననుంది. కార్యక్రమంలో శివయ్య, తులసి, ఉపాధ్యాయులు బొడ్డేపల్లి నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

కాపుతెంబూరులో జ్వరాలు

నందిగాం: కాపుతెంబూరులో విషజ్వరాలు ప్రబలాయి. పలువురు జ్వరాల బారినపడి మంచంపట్టారు. అధికారులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు డ్రైనేజీ నిర్వహణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.




చట్టాలపై అవగాహన అవసరం

పాతపట్నం: చట్టాలపై కనీస అవగాహన అవసరమని న్యాయమండలి చైర్‌పర్సన్, జూనియర్ సివిల్ న్యాయాధికారి రోషిణి అన్నారు. బొమ్మిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్యం నుంచే మహిళా పరిరక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అనంతరం గంగువాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో పాల్గొన్నారు. రోగులకు పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శివ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు బీఈ సత్యనారాయణ, న్యాయవాదులు ఎం.రమణ. ఎంఈవో బి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.







హార్బర్ పనులు వేగవంతం చేయాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎచ్చెర్ల: బుడగట్లపాలెం సముద్రతీరం వద్ద నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఈ మేరకు శనివారం అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. మత్స్య, అటవీ శాఖాధికారులతో హార్బర్ పనులపై చర్చించారు. హార్బర్‌కు కేటాయించిన స్థలంలో అటవీ శాఖ భూములు ఉన్నట్టయితే రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకుని పనులకు ఆటంకం కలుగకుండా చూడాలన్నారు. రెండు ఎకరాల అటవీ భూమికి సంబంధించిన సమస్యపై ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. పనుల పురోగతిపై 15 రోజులకోసారి నివేదిక అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సీహెచ్ రంగయ్య, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ వీవీ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎ.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



పనుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పలాసరూరల్: మండలంలోని రెంటికోట పీహెచ్‌సీ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన దుదిష్టి మంత్ర(36) అనే వ్యక్తి మృతి చెందాడు. మంత్ర తన పొలంలో పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు యువకులు పలాస వైపు బైక్‌పై అతి వేగంగా వెళ్తూ ఢీకొన్నారు. దీంతో తీవ్రంగా గాయపడిన మంత్రను స్థానికులు పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మంత్రకు భార్య దమయంతి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ద్విచక్ర వాహనంతో ఢీకొట్టిన యువకులకు కూడా గాయాలైనా వారు పరారయ్యారని స్థానికులు తెలిపారు. దీనిపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడో రోజు కొనసాగిన విచారణ



విచారిస్తున్న పోస్టల్ అధికారులు

పొందూరు: కనిమెట్ట పోస్టాఫీసులో జరిగిన అవకతవకలపై జిల్లా పోస్టల్ అధికారులు మూడో రోజు శనివారం విచారణ కొనసాగించారు. బీపీఎం లోకేష్ సమక్షంలో బాధితుల ఆర్డీ పుస్తకాలు ఇతర రికార్డులు పరిశీలించారు. సుమారు రూ1.20 లక్షలు ఖాతాదారులు నుంచి సేకరించిన నగదు వారిఖాతాలో జమ చేయనట్టు గుర్తించామని అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.గౌరీ శంకర్ తెలిపారు.

బాలికపై కుక్కల దాడి

సరుబుజ్జిలి: ఓ మూగ బాలికలపై కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఫకీరుసాహెబ్‌పేట గ్రామానికి చెందిన బలగ ఇందు శనివారం ఆరుబయట ఆడుకుంటుండగా.. కుక్కలు గుంపుగా దాడి చేశాయని తండ్రి జగదీష్ తెలిపారు. చేతులు, కాలిపై గాయాలయ్యాయన్నారు. వెంటనే ఆ చిన్నారిని జొన్నవలస ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించారు.

నందికొండలో డెంగ్యూ కలకలం



జ్వరంతో బాధపడుతున్న ప్రభాకరరావు

సరుబుజ్జిలి: మండల కేంద్ర సమీపాన నందికొండ కాలనీలో డెంగ్యూ జ్వర పీడిత కలకలం ప్రజలను భయాందోళనకు గురిచేస్తుంది. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ గ్రామానికి చెందిన బెండి ప్రభాకరరావుకు శ్రీకాకుళం వైద్యులు డెంగ్యూ జ్వరంగా నిర్ధారించారు. ప్రభాకరరావు కుటుంబ సభ్యులు అందించిన వివరాల మేరకు.. గతవారం రోజులుగా జ్వరం బారినపడి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సాయం పొందినా.. ఆరోగ్యం క్షీణించింది. దీంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ రక్త పరీక్షలు చేసిన వైద్యులు రక్త కణాలు 87వేలకు తగ్గాయని, డెంగ్యూ జ్వరంగా వైద్యులు నిర్ధారించారు. శనివారం గ్రామానికి చేరుకున్న ప్రభాకరరావు డెంగ్యూ జ్వరం బారిన పడిన విషయాన్ని తెలుసుకున్న నందికొండ కాలనీ ప్రజలు భయాందోళన చెందారు.

స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి



మాట్లాడుతున్న సీఐటీయూ కార్యదర్శి

అరసవల్లి: స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు కె.నాగమణి డిమాండ్ చేశారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్కీమ్ కార్మికులపై పాలక పార్టీ నేతల వేధింపులకు పాల్పడుతున్నారని, అక్రమంగా తొలగిస్తుండడం సరి కాదన్నారు. అరకొర వేతనాలతో బతుకులీడుస్తున్న చిరుద్యోగులకు ఈ మాత్రం ఉపాధిని కూడా దూరం చేస్తే వారెలా బతుకుతారని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాజకీయ వేధింపులు ఆపాలని, లేకుంటే పోరాటాలు చేస్తామని తెలిపారు. సీఐటీయూ నాయకులు ఎం.ఆదినారాయణమూర్తి, కె.సూరయ్య ఆర్.ప్రకాశరావు పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శ్రీకాకుళం రూరల్: సముద్ర జలాల్లో చేపల వేటకు వెళ్లి దేశ సరిహద్దు దాటి శ్రీలంక కోస్ట్‌గార్డ్‌లు పట్టుబడిన జిల్లాకు చెందిన మత్స్యకారుల కుటుంబాలను ఆదుకోవాలిన సంబంధిత అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఆదేశించారు. ఈ మేరకు శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఎలా ఉన్నారో' శీర్షికతో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ స్పందించారు. ఆయా బాధిత మత్స్యకార కుటుంబాలను ఆదుకొనేందుకు చర్యలు తీసుకోవాలని ఆ శాఖ డీడీకి సూచించారు. మత్స్యకారులు విడుదలయ్యే వరకు ఆర్థికంగా ఆదుకోవాలని మత్స్యశాఖ కమిషనర్‌కు డీడీ శనివారం లేఖ రాశారు. మత్స్యకారులు విడుదలయ్యేంతవరకు పూర్తి చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డుకోవాలి

అరసవల్లి: జిల్లాలో అర్ధరాత్రి సమయంలో అనేక ప్రాంతాల్లో జరుగుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అన్నారు. శనివారం నగరంలోని క్రాంతి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. వందల సంఖ్యలో లారీలు బూర్జ, నరసన్నపేట, ఆమదాలవలస, కొత్తూరు మండలాల్లో ఇసుక అక్రమ రవాణా పెద్ద ఎత్తున జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. మైన్స్, విజిలెన్స్ అధికారుల కనుసన్నల్లోనే అక్రమ రవాణా జరుగుతోందని ఆరోపించారు. వెంటనే అధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, కార్యవర్గ సభ్యులు మొజ్జాడ యుగంధర్, కొన్న శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

అలరించిన ఏకపాత్రాభినయ పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రంగస్థలం కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో నెలవారి సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఏకపాత్రభినయ పోటీలు అలరించాయి. ఈ సందర్భంగా డీపీఆర్వో బాలమాన్ సింగ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, కళాకారుల సంఘ అధ్యక్షులు చిట్టి వెంకటరావు, సంగీత దర్శకుడు పి.లీలామోహన్ సమక్షంలో జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభించారు. పోటీల్లో 30 మంది పౌరాణిక నటులు ఏకపాత్రాభినయం ప్రదర్శించారు. అంజనేయుడు, హరిశ్చంద్ర, కర్ణుడు, చంద్రమతి, శ్రీకృష్ణుడు, అర్జునుడు, విశ్వామిత్ర తదితర వేషధారణలో ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. సిక్కోలు కళలకు పుట్టినిల్లు అని, శ్రీకాకుళం రంగస్థల కళాకారులు సమాఖ్య ఎన్నో సంవత్సరాల నుంచి అనేక కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పౌరాణిక నటులు యడ్ల గోపాలరావు, పొట్నూరు వెంకట్రావు, బంటుపల్లి రామచంద్రదేవ్, పన్నాల నర్సింహమూర్తి, ఎల్.రామలింగస్వామి, కగల గణేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోను సస్పెండ్ చేయాలి

ఆమదాలవలస: కనుగువలస గ్రామంలో ఒకే ఇంటిలో భార్య భర్తలకు రెండు పింఛన్లు మంజూరు చేయడంపై ఎంపీడీవో వాసుదేవరావును సస్పెండ్ చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు, కనుగులవలస సర్పంచ్ నూకరాజు డిమాండ్ చేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయానికి గ్రామస్థులతో కలిసి వచ్చి పింఛన్ అక్రమాలపై ఎంపీడీవోను నిలదీశారు. గడిచిన ఐదేళ్లలో అక్రమ పింఛన్లు వెలుగులోకి రాకుండా అడ్డుకున్నారని, టీడీపీ అధికారంలోకి వచ్చాక పింఛన్లు జాబితా పరిశీలిస్తే ఒకే ఇంటిలో రెండేసి పింఛన్లు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఇటీవల ఈ విషయమై తాను ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. టీడీపీ నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, సనపల ఢిల్లీశ్వరరావు, బొడ్డేపల్లి గౌరీపతి పాల్గొన్నారు.

బీజేపీ నేత కుటుంబానికి పరామర్శ

ఎచ్చెర్ల: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం తల్లి అమ్మాయమ్మ ఇటీవల మృతిచెందారు. దీంతో ఫరీద్‌పేటలో వేణుగోపాలంను, కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నేత ఎంవీఎన్ మాధవ్ శనివారం పరామర్శించారు. ఆమె చిత్ర పటం వద్ద నివాళులర్పించారు.

చంద్రబాబును కలిసిన జేఎన్‌టీయూ సిండికేట్ సభ్యుడు



చంద్రబాబుతో మాట్లాడుతున్న రాజేష్

శ్రీకాకుళం: ముఖ్యమంత్రి చంద్రబాబును జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) సిండికేట్ సభ్యుడు డాక్టర్ బుడుమూరు రాజేష్ శనివారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. రాజేష్ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తుండటంతో.. ఓబీసీ సంఘం అధ్యక్షుడు వర ప్రసాద యాదవ్‌తో కలిసి ముఖ్య మంత్రిని కలుసుకున్నారు. సూర్య నారాయణస్వామి ప్రతిమను చంద్రబాబుకి అందజేశారు.

రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ నాయకుడు..



సీఎంను కలిసిన భానోజీనాయుడు

రణస్థలం: ముఖ్యమంత్రి చంద్రబాబును రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ ఆర్గనైజేషన్ సెక్రెటరీ పిన్నింటి వెంకట భానోజీనాయుడు శనివారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. సర్పంచ్‌ల హక్కులకు, విధులకు ఎటువంటి భంగం వాటిల్లదని చంద్రబాబు ఇచ్చిన హామిని స్వాగతిస్తున్నట్టు ఆయన తెలిపారు. సర్పంచ్‌ల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళాడు.

కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా



ఎమ్మెల్యే శంకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అరసవల్లి: నగరంలోని విశాఖ-ఎ కాలనీ వాసులు ఎమ్మెల్యే గొండు శంకర్‌ను శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీ వాసుల రుణం తీర్చుకోలేనిదన్నారు. త్వరలోనే కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహిస్తామని, కాలనీని అన్నివిధాలా అభివృది చేస్తానన్నారు. కాలనీవాసులకు ఎటువంటి ఇబ్బంది కలిగినా నేరుగా తనను కలవచ్చునన్నారు. నగర కమిషనర్ కాలనీ పార్కును పరిశీలించడం జరిగిందని, మరో మూడు రోజుల్లో అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేసి, నగరంలోనే సుందరమైన పార్కుగా తీర్చిదిద్దుతా మన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సింతు సుధాకర్, ఎస్వీ రమణ మాదిగ, కొమ్మనాపల్లి వెంకటరామరాజు, శ్రీనివాస్, విజయరామ్, పెద్ద ఎత్తున మహిళలు, చిన్నారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక పరివర్తన

అరసవల్లి: ఆధ్యాత్మికతతోనే మానసిక పరివర్తన, క్రమశిక్షణ అలవడుతుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. నగరంలోని న్యూ కాలనీలో గల సత్యసాయి మందిరంలో శనివారం నిర్వహించిన రుషి మహిత్వవ యాగంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఆధ్యాత్మిక అనుభవాలను భక్తులతో పంచుకున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రజలు తీవ్ర ఒత్తిడికి గురై దీర్ఘకాలిక రోగాల బారిన పడుతున్నారని, ఆధ్యాత్మిక భావనలు పెంపొందించుకుంటే మానసిక రుగ్మతలు నయమవుతాయని తెలిపారు. తనకు ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో చేరిన తరువాత శ్రీశ్రీ రవిశంకర్ గురూజీ పరిచయం తనను పూర్తిగా మార్చివేసిందని, తనను ఉన్నతంగా తీర్చిదిద్దిందని పేర్కొన్నారు. సత్యసాయి భక్తులు చేస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమం, సేవా కార్యక్రమాలు ఎంతో విలువైనవని కొనియాడారు. కార్యక్రమంలో సత్యసాయి భక్తులు, మందిర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాగు, సాగు నీటికి ప్రాధాన్యం



తాగునీటి కొళాయిని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

లావేరు: ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ప్రతీ ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటితోపాటు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు ఎమ్మెల్యే ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. శనివారం భీమునిపాలెం, కూనపువానిపేట, ఆరంగిపేట గ్రామాల్లో ఇంటింటికి తాగునీటి కొళాయిలను విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి ఆయన ప్రారంభించారు. అలాగే లావేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు పంపిణీ చేశారు. కళాశాల వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ఎంపీ కలిశెట్టి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు తగిన ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. కళాశాలకు అవసరమైన సామగ్రీ, కంప్యూటర్స్ సమకూర్చనున్నట్టు హామీ ఇచ్చారు. అనంతరం ఉపాధి పథకంలో భాగంగా ఆయా గ్రామాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సూర్యనారాయణ, తహసీల్దార్ జోగారావు, ఈవోపీఆర్‌డీ విశ్వేశ్వరరావు, ఏపీవో సత్యవతి, టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ తోటయ్యదొర తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలి



నిరసన తెలుపుతున్న ఆదివాసీ, గిరిజన నాయకులు

కంచిలి: గిరిజనులకు ప్రభుత్వం కేటాయించిన భూములకు రక్షణ కల్పించాలని ఆదివాసీ, గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నువాగడ పంచాయతీలో గిరిజనులకు ప్రభుత్వం నిర్మిస్తున్న మల్టీపర్పస్ భవన నిర్మాణ పనులను అడ్డుకుంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆ సంఘాల నాయకులు సవర ధర్మారావు, రుషి భయ్యా డిమాండ్ చేశారు. శనివారం నువాగడ కాలనీలో అన్యాక్రాంతమైన భూములలో తుప్పలు, దొంకలు తొలగించి ప్రభుత్వం మంజూరు చేసిన మల్టీపర్పస్ భవన నిర్మాణానికి భూమి చదును చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సుమారు నాలుగు వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ భూమిలో కొంతమంది గిరిజనులకు పట్టాలు పంపిణీ చేసిందని తెలిపారు. ఈ భూమిలో కొంత స్థలాన్ని గిరిజన భవన నిర్మాణానికి అధికారులు ఎంపిక చేశారు. ఆ స్థలం తనదంటూ భవన నిర్మాణాన్ని అడ్డుకోవడమే కాకుండా స్థానిక సర్పంచ్, సచివాలయం కార్యదర్శికి, కాంట్రాక్టర్‌కి లాయర్ నోటీసులు పంపడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గిరిజనుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన భవన నిర్మాణాన్ని అడ్డుకున్న గిరిజనేతరుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసి, గిరిజన సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో ప్రదర్శన చేసి అనంతరం ఆ భూమిని చదును చేశారు. సర్పంచ్ సబిత గొమాంగో, సంఘాల నాయకులు జోగేంద్ర, జయరామ్, ఖగపతి, రామచంద్ర, లక్షణ కింగార, సునేంద్రగొమాంగో, రైతు సంఘ జిల్లా కార్యదర్శి కె.మోహన్‌రావు, సీఐటీయూ నాయకులు సంగారు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి యంత్రాంగం పనితీరు మార్చుకోవాలి

సరుబుజ్జిలి: ఉపాధి హామీ పథకం యంత్రాంగం పనితీరు సక్రమంగా లేదని పలువురు ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు ఆధ్వర్యంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక సభ శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. సోషల్ ఆడిట్ డీఆర్పీలు పంచాయతీల వారీగా పలు ఆరోపణలపై గుర్తించిన అంశాలను వరుస క్రమంలో చదివి వినిపించారు. ఆడిట్ సమయంలో పలు ఆరోపణలు వచ్చాయని డీఆర్పీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో మండల ప్రత్యేకాహ్వానితుడు సత్యనారాయణ, జడ్పీటీసీ నాగేశ్వరరావు, జిల్లా విజిలెన్స్ అధికారి లవరాజు, క్వాలిటీ కంట్రోల్ సతీష్, ఏపీడీ పంచాది రాధ, ఏకేసీవో గోవింద్, మన్మధ, ఏపీవో పార్వతి, ఈసి రమాదేవి పాల్గొన్నారు.

కొవ్వాడ అణుపార్కు రద్దు చేయాలి



ర్యాలీ చేపట్టిన సీపీఎం నాయకులు

రణస్థలం: కొవ్వాడ అణుపార్కు రద్దు చేయాలని, ప్రహరీ నిర్మాణం నిలుపుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రానికి రద్దు చేయాలని కోరుతూ కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రం ప్రభావిత ప్రాంతాలు కోటపాలేం, కొవ్వాడ, అల్లివలస గ్రామాల్లో పర్యటించారు. కొవ్వాడలో అణువిద్యుత్ కేంద్రం పెడితే ఉత్తరాంధ్రలో అణుబాంబు పెట్టినట్టేనన్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంప్ పరిశీలన

బూర్జ: నారాయణపురం నదీ తీరంలో కాఖండ్యాం ఇసుక ర్యాంప్‌ను శనివారం తహసీల్దార్ ఈశ్వరమ్మ పరిశీలించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవన్నారు. ర్యాంప్ దగ్గర కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎవరికైనా ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే, వాటిని కార్యాలయంలో చూపించాకే తవ్వకాలు, రవాణా చేయాలని స్పష్టం చేశారు.

బాలలను పనుల్లో పెడితే కేసులు

ఇచ్ఛాపురం: బాలలను పనుల్లో పెడితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.విజయ్‌కుమార్ అన్నారు. బాలకార్మికులపై రెస్క్యూ నిర్వహించారు. యాక్షన్ మంత్ ఆఫ్ అగెనెస్ట్ చైల్డ్ లేబర్ కార్యక్రమంలో భాగంగా బాలకార్మికులపై రిస్క్యూ నిర్వహించారు. శనివారం పట్టణ పరిధిలో గల వివిధ దుకాణాలతో పాటు గ్యారేజ్‌లో తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో డీసీపీయూ సోషల్ వర్కర్ జనార్దన్, చైల్డ్‌హెల్ప్ లైన్ కౌన్సిలర్ ఎం.సునీత, ఎన్జీవో సభ్యులు స్వాతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

కవిటి: బల్లిపుట్టుగ గ్రామానికి చెందిన పేద విద్యార్థి బి.వాసుదేవ్‌కు హైదరాబాదుకు చెందిన చింతామణి ట్రస్టు శనివారం ఆర్థిక సాయాన్ని అందించింది. వాసుదేవ్ ప్రస్తుతం ఐటీఐ చదువుకొని ఉద్యోగానికి శిక్షణ పొందుతున్నాడు. గత రెండేళ్లుగా ట్రస్టు ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ఈ ఏడాది విద్యార్థికి అవసరమైన రూ.40 వేలు అందించారు. కార్యక్రమంలో బి.రమేష్, ఎ.మధు, పి.శేఖర్, బి.కామరాజు, ఎ.రాజు, ఎం.సీతారాం పాల్గొన్నారు.

ఫిషర్మెన్ సొసైటీ కార్యవర్గం

గార: కె.మత్స్యలేశం (పోర్టు కళింగపట్నం)లోని మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడిగా కొమర ఢిల్లీరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పుక్కల్ల సత్యనారాయణ, కార్యదర్శిగా మైలపిల్లి కృష్ణమూర్తితో పాటు కొంతమంది సభ్యులు ఎన్నికయ్యారు. వీరిని కూటమి నాయకులు కెప్టెన్ మైలపిల్లి జనార్దరావు, ఇతర కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు.

స్మార్ట్ ఫోన్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి జ్యోత్స్న

పొందూరు: భవిష్యత్తును అంధకారం చేస్తున్న డ్రగ్స్, స్మార్ట్ ఫోన్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని పొందూరు కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.జ్యోత్స్న అన్నారు. కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. తెలియని వయస్సులో మత్తుపదార్థాలకు విద్యార్థులు బానిసలవుతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ సునీత, ఎస్ఐ వీవీ రమణ, సర్పంచ్ రామప్రసాద్, ఎంపీటీసీ కె.హనుమంతురావు, అధ్యాపకులు, పొందూరు బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల బారిన పడొద్దు

ఆమదాలవలస: మాదక ద్రవ్యాలకు యువత దూరంగ ఉండాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి నాగమణి అన్నారు. దన్నానపేట వద్ద ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మీబాయ్, అసిస్టెంట్ గవర్నమెంట్ లీడర్ సీపాన గోవిందరావు, న్యాయవాదులు పైడి వరహా నరసింహం, బొడ్డేపల్లి మోహన్‌రావు, తమ్మినేని అన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురం: యువత మాధక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. శనివారం పట్టణ పరిధిలో గల రాజారాణి మైదానంలో యువతకు డ్రగ్స్ వల్ల కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీనివాసరావు

కంచిలి: తలతంపరలో వానప్రస్థ ఆశ్రమంలో శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు మానసిక వికలాంగుల హక్కులు, ఉచిత న్యాయ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సర్వేశ్వరరావు, న్యాయవాదులు ఎన్ఎస్ విజయ్‌కుమార్, సంస్థ ప్రతినిధులు జి.రమేష్, జి.మోహన్ పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

కవిటి: మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కె.రాము అన్నారు. కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. సెల్ ఫోన్లకు దూరంగా ఉండి, చదువుపై దృష్టి సారించాలన్నారు. ప్రిన్సిపాల్ పి.రాజేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీవో జె.పాపారావు పాల్గొన్నారు.

యువత మంచి మార్గంలో నడవాలి

రణస్థలం: యువత మంచి మార్గంలో నడవాలని జేఆర్ పురం సీఐ రామచంద్రరావు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల బారినపడితే కలిగే అనర్థాలపై వివరించారు. అదేవిధంగా నిబంధనలకు విరుద్ధంగా శబ్దకాలుష్యం చేస్తూ వాహనాలు నడపడం మంచిది కాదన్నారు. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు ఒకన్నేసి ఉంచడాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

● మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిఎం యుగంధర్, కె.శ్రీనివాసు అన్నారు. మాదకద్రవ్యాల వ్యాపారా లను అరికట్టాలని కోరుతూ శనివారం ఒక ప్రైవేట్ కళాశాల నుంచి రామతీర్థం జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. పోలీస్ యంత్రాంగం దృష్టి పెట్టి పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మానవహారం చేపట్టారు.

కేంద్రమంత్రిని కలిసిన ఎస్పీ



కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని ఎస్పీ మహేశ్వరరెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో మహిళా సంరక్షణ, లా అండ్ ఆర్డర్ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎస్పీతో ప్రత్యేకంగా కేంద్ర మంత్రి మాట్లాడారు. యువత పెడదారిన పడకుండా గంజాయిపై ఉక్కుపాదం మోపాలన్నారు. వీరితోపాటు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఉన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

ఆమదాలవలస: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, పరిసరాలు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎస్ఐ సింహాచలం ఇతర పోలీస్ సిబ్బంది యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. శాఖాపర మైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు పరిశీలన

కలెక్టరేట్/ గుజరాతీపేట, ఆగస్టు 3: శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం పరిశీలించారు. పారిశుధ్యం నిర్వహణ, తాగునీరు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ప్రజాప్రతినిధులకు, జిల్లా అధికారులకు, స్వాతంత్ర్య సమరయోధులకు, ప్రజలకు సీటింగ్ ఏర్పాట్లు ప్రోటోకాల్ ప్రకారం చేపట్టాలని తెలిపారు. ఆకర్షణీయంగా ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి, డీఎస్పీ శృతి, ఆర్డీవో రంగయ్య, కార్పొరేషన్ కమిషనర్ ఓబులేసు, డీపీవో వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, పౌరసంబంధాల అధికారి చెన్న కేశవరావు, తహసీల్దారు గణపతిరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సోంపేట: తమ గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని కొర్లాం గ్రామస్థులు కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. కొర్లాంలో స్టేట్‌బ్యాంక్ శాఖను ఏర్పాటు చేయాలని, రైల్వేస్టేషన్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో జాగృతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి, గ్రామస్థులు రత్నాల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

● కంచిలి: మండలంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని మండల టీడీపీ నాయకులు మంత్రి రామ్మోహన్ నాయిడును కోరారు. ఈ మేరకు శనివారం శ్రీకాకుళంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు కంచిలి రైలు నిలయం అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని, డిజిటల్ బోర్డులు ఏర్పాటు, పలు గ్రామాల్లో రైల్వే అండర్ పాస్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు.

ఆదిత్యాలయ ఉద్యోగుల సస్పెన్షన్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన జేవీవీ కృష్ణమాచార్యులు, జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన శ్యామలరావు అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు రావడంతో వారిపై విచారణ జరిగింది. ఆ నివేదికలు విజయవాడలోని దేవదాయ శాఖ కమిషనర్‌కు పంపించారు. వారు అవినీతికి పాల్పడినట్టు రుజువు కావడంతో వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానం ఈవోగా ఉన్న కృష్ణమాచార్యులను, ఆదిత్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న వై.శ్యామలరావులను సస్పెండ్ చేస్తున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. కాగా విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం ధర్మవరం సన్యాసేశ్వర స్వామి ఆలయంలో పనిచేస్తున్న రమణమూర్తి బదిలీపై ఆదిత్యాలయ జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు చేపట్టారు.

ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శ్రీకాకుళం, పలాస, సోంపేట ప్రాంతాల్లో చిల్డ్రన్ హోమ్‌లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలాస, సోంపేటలో వంట మనిషి పోస్టులు మూడు, హెల్పర్/నైట్‌వాచ్‌మన్ పోస్టులు మూడు, విద్యావేత్త పోస్టులు రెండు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కమ్ మ్యూజిక్ టీచర్ పోస్టులు రెండు, శ్రీకాకుళంలో సంగీత ఉపాధ్యాయురాలి పోస్టు, పీటీ ఇన్‌స్ట్రక్టర్‌కమ్-యోగా ట్రైనర్ పోస్టులు రెండు, లీగల్ కౌన్సిలర్ ఒక పోస్టు(శ్రీకాకుళం), పారామెడికల్ సిబ్బంది ఒకటి (శ్రీకాకుళం), మల్టీపర్పస్ హెల్పర్ పోస్టు ఒకటి (శ్రీకాకుళం) భర్తీచేయనున్నట్టు పేర్కొన్నారు. అసక్తి గల అభ్యర్థులు ఈ నెల 4వ తేదీ నుంచి 17వ తేదీలోగా దరఖాస్తులు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ కార్యాలయానికి పంపాలని కోరారు. అభ్యర్థుల ఎంపిక ఇంటర్వ్యూల ఆధారంగా జరుగుతుందని.. ఆలస్యంగా చేరిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవడం జరగదని స్పష్టంచేశారు.

బీజేపీని బలోపేతం చేస్తాం

ఇచ్ఛాపురం: అందరి సహకారంతో మండల స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వైకుంఠరావు అన్నారు. శనివారం బెల్లుపడ గ్రామం ఎల్లమ్మ గుడి ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం పూర్తిగా నష్టపోయిందన్నారు. ప్రధానమంత్రి మోదీ రాష్ట్రాన్ని అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. అనంతరం పార్టీ నాయకులు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అశి సత్యం, మండల అధ్యక్షుడు రామ్మూర్తి, నాయకులు వడ్డిన సంతోష్, నీలవేణి, ఎం.లక్ష్మి, సాలిన ఢిల్లీరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికడతాం

శ్రీకాకుళం రూరల్: బైరి, కరజాడ, బట్టేరు, పొన్నాం, నైరా గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్టు సమాచారం రావడంతో శనివారం తహసీల్దార్ ఎస్.గణపతిరావు పర్యటించారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు రహదారి మార్గాల్లో జేసీబీతో ట్రెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. తహసీల్దార్‌తో పాటు డీటీ రాజు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.